

# బఫెల్లోస్ క్లబ్





బర్రె శవం.

పొట్ట బాగా ఉబ్బి ఉంది.

చర్మం నెర్రెలు నెర్రెలుగా చిట్లి, అందు లోంచి కారిన రక్తం గడ్డకట్టి నల్లగా, నీలనీలంగా, కళ్ళు తెరుచుకొనే ఉన్నాయి.కనుగుడ్లు చీలి ఉన్నాయి. కళ్ళ చుట్టూ రక్తము, పల్చటి సొన గడ్డకట్టి.

ముట్టి బిగుసుకుపోయి ఉంది. పళ్ళు బయటకు పొడుచుకొని వచ్చాయి. పళ్ళ చుట్టూ రక్తం ఎండిపోయి ఉంది.

బర్రె శవం అట్లా గాలిలో వేళ్ళాడుతుంది.

ఏ క్షణంలోనైనా పైనబడుతుందేమోనని భయం.

దాని కింద నలిగి నేను చచ్చిపోతానేమోననే భయం.

ఉలిక్కిపడి నిద్ర లేచాను.

రాత్రంతా ఇట్లాంటి పీడకలలే.

నిర్జనమైన వీధులు, తగలబడుతున్న ఇళ్ళు, భయంతో పరిగెత్తుతున్న జనం - కెమెరాలో స్నాప్‌షాట్స్‌లా వెంటాడుతూనే ఉన్నాయి.

పంజరంలో చిలుక శవం, తెగిపడిన ఒంటరితల నెత్తిపై టప్ టప్‌మని జారిపడుతున్న రక్తపు బొట్లు.

నరకం చూశాను.

రోజు మొదలైంది.

కాఫీ తాగుతూ, తాపీగా పేపరు చదువుకొంటున్న మాలతి.

“నిద్ర సరిగ్గా పట్టలేదా?” అంది మాలతి. “త్వరగా తయారవ్వండి. నాలుగు మైళ్ళ నడక.”

నేనేం మాట్లాడలేదు.

కాఫీ తెచ్చి ఇస్తూ “బసవన్నపాలెం ఒక నిజం. సుబ్బమ్మ ఒక నిజం, పగిలిన తల, కూలిపోయిన గుడిసె, బర్రె శవం కూడా నిజాలే. మన మొట్టి ప్రేక్షకులం అనే మాట కూడా నిజం.”

మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ “మన ఎమ్మేవో కూడా ఎస్సీ నట కదా.” అన్నాను.

“ఏమో, ఆయనెప్పుడూ తెర తీయలేదు. నేను అందులోంచి చూడ లేదు. అయినా మన యుద్ధభూముల్లో హీరోలుండరు, కవర్డ్స్, అంతటా పిరికి వాళ్ళే” మాలతి.

“ఎవరి గురించి చెబుతున్నావు?”

"మన గురించే. మన మొట్టి తోలుబొమ్మలం. వెనకెవడో తాడు లాగుతుంటాడు. రక్తపు మడుగులన్నింటి మీదా మన వేలిముద్రలుంటాయి. అయినా నోరెత్తం. రాత్రులు మాత్రం పీడకలలు తెచ్చుకొని ఉలికిపాటుతో గడుపుతుంటాము."

మాలతి ముఖం ఎర్రగా అయింది.

"ఒక దళిత మహిళా సర్పంచిపై దాడి జరిగితే దాని ఊసే జనానికి పట్టదు. ఆ వార్త పేపర్లలో చేరదు. పోలీసులకు తెలియదు. రాత్రికి రాత్రి కప్పిపెట్టిన శవంలా. నేలను చదునుచేసి ఏమీ జరగలేదని నమ్మించడానికి ఈ లంజ వేషాలు. మండల్ సిబ్బంది మొత్తం కట్టకట్టుకు వెళ్ళి ఆగష్టు పదిహేను జరపటం, దానికో ఎమ్మెల్లే సాక్షి."

"ఆరు నెలల నుంచీ సుబ్బమ్మ మొత్తుకొంటూనే ఉంది. పంచాయితీ ఆఫీసు కెళితే కుర్చీలో కూర్చోకూడదు. నేలపైనే. పేరుపెట్టి కూడా పిలవరు. 'ఒసే' అనో కోపమొస్తే 'లంజా' అనో పిలుస్తారట. వేలుముద్రల మిషన్‌లాగా, ఏం జరుగుతుందో చెప్పరు. వచ్చిన గ్రాంటంతా జేబుల్లో వేసుకొంటారు. 'సంవత్సరమైంది, మాదిగ పల్లెకు ఒక బోరింగ్ వేయించుకోలేకపొయ్యాను' అని వాపోతుంది."

"ఎమ్డీవోకి అర్జీ రాసిస్తే, అందులోని విషయాలు మరిచిపోయి, ఎవరు నీకు అర్జీ రాసిచ్చారు అంటూ కూపీ లాగుతాడు ఎమ్డీవో కలెక్టరు దగ్గరకు వెళితే 'ఇది మీ ఊరి స్వంత విషయం. ఐయామ్ హెల్ప్‌లెస్' అంటాడట. ఈ బ్యూరోక్రసీ మొత్తాన్నీ తగలబెట్టినా పాపంలేదు."

"సూపరెండెంటుగారు" బయట బంట్రోతు పిలుపు. "అందరూ మీకోసం ఎదురు చూస్తున్నారు."

ఇద్దరం బయల్దేరాం. మాతోబాటు నలుగురు యూడీసీలు, ఇద్దరు బంట్రోతులు, రిటైరు కావడానికి సిద్ధంగా ఉన్న సీనియర్ సూపరెండెంటు, ఎమ్డీవో, ఈవోలు, వారి వందిమాగధులు జీపుల్లో బయలుదేరారు. మిగిలిన వాళ్ళంతా కాలి నడకన.

చేలన్నీ పుగాకు పంటలే. పెద్ద సైజుకు పెరిగిన క్యాన్సర్ క్రిమిలా విశాలంగా విప్పారిన ఆకులు. వెగటు వాసన. చేల మధ్యన పుగాకు బేరన్‌లు. మగ్గబెడుతున్న పుగాకులోంచి ఎగిసివస్తున్న నికోటిన్ వాసనలు. బేరన్‌ల పక్కనే పాడవాటి పాకలు. అందులో గ్రేడింగ్ చేస్తున్న ఆడవాళ్ళు.

పల్చటి ఉదయపు ఎండ. మబ్బులు కప్పిన ఆకాశం. కాలిబాటన మా కెదురౌతున్నారు ఊరి ఆడవాళ్ళు. పుగాకు గ్రేడింగ్ కోసం బయల్దేరినవాళ్ళు. చేతుల్లో స్టీలు కారేజీలు, మానవ జీబ్రాల్లా వేగంగా నడుస్తున్నారు.

"అమ్మాయా, నరం ఇంజక్షన్ ఇత్తావా. కాళ్ళు ఒకటే లాగుతున్నాయి" మాలతిని బాటలోనే ఆపింది ముసలమ్మ. "సాయంకాలం ఇంటికొస్తాన్లే. మందులేమీ తేలేదు" హెల్త్‌వర్కర్‌గా వాళ్ళకు బాగా సన్నిహితం మాలతి.

"సుబ్బమ్మగారు ఊళ్ళోనే ఉన్నారా?"

"సుబ్బమ్మ ఉంది. బఱ్ఱె శవం కూడా ఉంది. మీరు మద్దిపాడు నుంచి లాక్కొచ్చిన పిల్లకాయలు కూడా ఉన్నారు. పొయ్యి ఆ తమాసాలన్నీ చూడండి" నడికారు ఆడమనిషి కోపంతో అరిచింది.

*   *   *

ముఖాలపై హడావుడిగా పూసుకొచ్చిన ఉత్సాహం. కనురెప్పలే లేనట్లుగా కళ్ళను తెరిచి ఉంచుకొని, శరీరాన్ని భూమిలో పాతుకొని గాజుబొమ్మల్లా నిలబడ్డ - వందకు పైగా ఉన్న స్కూలు పిల్లలు.

రంగు కాగితాలు, మైకుల్లో పాటలు, రెక్కలు రాని పక్షిలా ఎగరని జాతీయ జెండా, ఉదయం ఎనిమిది నుంచీ అట్లాగే నిలబడ్డారు వాళ్ళు. కాళ్ళు భూమిలోకి దిగబడ్డట్టుగా. అసలు కాళ్ళే లేనట్లుగా.

వాళ్ళ ముఖాలపై ఉత్సాహాన్ని పూయడానికి ప్రయత్నిస్తున్నారు అయ్యవార్లు.

ఒంగోలు నుండి ఖద్దరు ఆసామి రావాలి. అప్పుడే జెండా రెక్కలు విప్పుతుంది. అప్పటిదాకా పిల్లలకా కష్టాలు తప్పవు.

"నువ్వెళ్ళి ఆ సుబ్బమ్మ సంగతి చూడ్రాదూ?" ఎమ్డీవో టెన్షన్‌గా ఉన్నాడు.

"ఏమిటి సంగతి?" తాపీగా అడిగాను.

"ముసిల్దాని గేదె చచ్చిపొయ్యిందట."

"నేను వెళ్ళి పోస్టుమార్టమ్ చెయ్యాలా?" విసుగ్గా అన్నాను. "ఇన్-సబార్డినేషన్, ఇన్-సబార్డినేషన్" అని గొణుక్కొంటూ ఎమ్డీవో వెళ్ళిపోయాడు.

పిల్లల ముఖాలపై ఉత్సాహం ఇంకా కరిగిపోలేదు.

ఖద్దరు ఆసామి ముందు చెయ్యాల్సిన ఫీట్లు పదేపదే ప్రాక్టీసు చేస్తున్నారు.

వలయాలు వలయాలుగా చీలి - అది డ్యాన్స్ బాలే.

హార్మోనియం, తబలా, వేణువు కలగలిపి, ఒక పాటను వండుతున్నారు.

చిలుకతో సర్కస్ ఫీట్స్ - స్టార్ అట్రాక్షన్ అదే! స్కూలు కుఱ్ఱాడే చిలుకను ఎట్లా నేర్పించాడోగాని గొప్పగా ఫీట్స్ చేస్తుంది.

చిలుక ఒంటినిండా రంగుల్ని పెయింట్ చేశాడు. మూడు రంగుల జాతీయజెండాకు నకలుగా - సన్నని ఇనుప సువ్వలతో చేసిన పంజరం. లోపల రెక్కలు టపటపలాడిస్తూ రంగుల చిలుక - పెయింటెడ్ బర్డ్!

"ఎగరాలి! నాంచారీ! ఎగరాలి!" కుర్రాడు దాన్ని ఉత్సాహపరుస్తున్నాడు. ఆ ఉత్సాహంతో అది పంజరంతోపాటు గాల్లో ఎగురుతుంది. గొప్ప దృశ్యం. ఎగిరి ఎగిరి దబ్బున నేలపై పడింది. చిలుక నోటినిండా రక్తం. వాడు దాన్ని బయటకు తీసి, రక్తాన్ని తుడిచి, కాసిన్ని నీళ్ళు పెట్టి, గింజలు పెట్టి మళ్ళీ ఉత్సాహపరుస్తున్నాడు.

"నువ్వా సుబ్బమ్మ సంగతి చూడ్రా బాబు!"

ఎమ్మీవో మళ్ళీ నస మొదలుపెట్టాడు. "లేడీ సర్పంచ్. అందునా ఎస్సీ ఇష్యూ, రైజ్ అవకుండా ఏదోలా సరిచెయ్యి. నేనా మాజీ సర్పంచ్ తోటి, మిగిలిన కౌన్సిలర్లతోటి మాట్లాడతాను. గొడవలేమి కాకుండా చూడ్రా బాబు" అతని ముఖంపై కంగారు, చెమటలు.

కుర్రాడు మళ్ళీ చిలుకను ఉత్సాహపరుస్తున్నాడు. "ఎగరాలి నాంచారీ. ఎగరాలి!" అంటూ.

పక్కనే చావు వాసన. శవం నడిచి వస్తున్న అనుభూతి. యుద్ధకాలం నాటి కవాతు. భూగోళాన్ని తాడుతో లాగుతున్నట్లుగా బరాబరా శబ్దం. మురుగు వాసన. కాదు మరణపు వాసన. కుళ్ళి పెనుకంపులా మారిన వాసన. బరాబరా శబ్దం దగ్గరవుతుంది. వాసనకు తాడుకట్టి లాగుతున్నట్టు. వాళ్ళేబయిమంది దాకా ఉంటారు. పొగలు పొగలుగా చీకటి కమ్ముకొస్తున్నట్లుగా, గుంపుగా వస్తున్నారు. అందరూ ఆడవాళ్ళే, అందునా ముసలివాళ్ళే. ప్రాణాల్ని మోసు కొస్తున్నంత భద్రంగా వాళ్ళు మోసుకొచ్చేది బర్రె శవం.

పంచాయితీ ఆఫీసు ముందు బర్రె శవం.

కుళ్ళి, ఉబ్బి, దుర్గంధపు మూటలా ఉన్న బర్రె శవం.

"లంజముండల్లారా! ఏమిటే ఇది?" మాజీ సర్పంచ్ రంగారావు పెద్దగా కేకలు వేసుకొంటూ వచ్చాడు. ముందుగా తేరుకొంది అతనే. మిగిలిన వాళ్ళంతా బొమ్మల్లా చూస్తున్నారు.

"నోరు లేని జీవం అది. నా బట్టల్లారా. దాని జోలి మీకేం వచ్చింది. ముండమోపి జెండా ఎగరేస్తానన్నందుకు ఇంత జేస్తారా? అడిగే దిక్కు లేదనా మీ యిష్టం వచ్చినట్లు చేస్తున్నారు. ఒంగోలు నుంచి ఆడెవడో వస్తున్నాడుగా, ఎమ్మెల్లే అని, ఆ నా బట్టనే అడుగుతాను. ఈ బర్రెగొడ్డు నెందుకు చంపాల్సి వచ్చిందో చెప్పమని."

ఫట్‌మంటూ సుబ్బమ్మ మూతిపై కొట్టాడు రంగారావు. మూతినిండా రక్తం. దబ్బుమని నేలపై పడింది. కిందబడినదాన్ని అట్లాగే కాలితో తన్నాడు.

"వామ్మో! నాయనో! ఓ సుబ్బమ్మత్తో!" ఒక్కసారిగా గొల్లుమన్నారు ఆడవాళ్ళు. రంగారావును పక్కకు దోసి, సుబ్బమ్మ చుట్టూ మూగారు.

"చంపరా నాబట్టా చంపు! నీకు సాడు బొయ్య! నీ దినం జెయ్య!" సుబ్బమ్మ పెద్దపెద్దగా అరుస్తోంది. సుబ్బమ్మను నడిపించుకొంటూ వాళ్ళు పల్లె వైపుకు వెళ్ళారు.

ఎదురుగా శవం.

స్కూలు పిల్లలందరూ భయంతో దూరం జరిగారు.

చిలుకా, పంజరం, కుర్రాడు ఎటో ఎగిరిపొయ్యారు.

ఎమ్డీవో ముఖంలో కంగారు.

"ఒరేయ్! వెట్టివాళ్ళెవరైనా దొరుకుతారేమో చూడండిరా" రంగారావు అరుస్తున్నాడు. ఎవరూ రారని అతనికి బాగా తెలుసు.

భీతిల్లిన ముఖంతో అటూ ఇటూ తిరుగుతున్నాడు ఎమ్డీవో.

"హెడ్ మాష్టరెక్కడున్నాడో చూడండి. పిల్లల్నిబెట్టి దాన్ని కాస్త దూరంగా లాగించండి." హెడ్‌మాష్టరు కనబడలేదు. పిల్లలు అయిష్టంగా దూరంగా జరిగారు.

శవం కదల్లేదు.

ఎమ్డీవో ముఖం ఆకులు రాలిన అడవిలా ఉంది. తూటా దెబ్బ తిని గిలగిలలాడుతున్నట్లుగా ఉంది.

"ఇదుగో సూపరెండెంటూ, మన సమితి ఆఫీసు స్టాఫునంతా పిలవండి. బ్రైను లాగివెయ్యమనండి. ఎమ్మెల్లేగారు వచ్చే టైం అయింది."

స్టాఫ్ వైపు నుండి రెస్పాన్స్ లేదు.

శవం కదల్లేదు.

"ఇది నా ఆర్డర్. కాదంటే డిసిప్లినరీ ఏక్షన్ తీసుకొంటాను" ఎమ్డీవో గొంతులో అసమర్థుని కోపం.

నసుక్కుంటూ, తిట్టుకొంటూ బ్యూరోక్రసీ అంతా కదిలింది.

ముక్కులతో ముఖాన్ని కప్పుకొని, కులవ్యవస్థ అంత బరువైన కుళ్ళిన శవాన్ని లాగుతూ, లాగుతూ...

"ఏవమ్మా, నువ్వేమిటి అట్లా నిలబడ్డావు. నీకు వేరే చెప్పాలా?" మాలతి నుద్దేశించి అరుస్తున్నాడు ఎమ్డీవో.

"ఇది నా డ్యూటీ కాదు. నేను చెయ్యను."

"హెల్త్ వర్కర్‌వి కదా. నీ డ్యూటీ కాదంటావేమిటి?"

"ముందు మీ డ్యూటీ చెయ్యండి. పంచనామా రాయించండి. ఒక ఎస్సీ మహిళా సర్పంచ్‌ని ఇంతమంది ముందు అవమానించి కొట్టినందుకు కలెక్టరుకు రిపోర్టు ఇవ్వండి. ఆ తరువాత నా డ్యూటీ చేస్తాను."

"చాలా ఎక్కువ మాట్లాడుతున్నావు. నీ లిమిట్స్‌లో ఉండు. నీకు మెమో ఇస్తున్నాను."

మాలతి నిర్భయంగా చూస్తుంది.

కళేబరం కదుల్తుంది. కుళ్ళిన మాంసాన్ని పార్లిస్తున్నట్లుగా.

బరబరా లాగుతూ, పీనుగుల గుట్టను ఈడుస్తున్నట్లుగా ఈడుస్తూ.

దూరంగా మాలతి.

ఎత్తయిన కొండలా.

కుళ్ళింది బర్రె శవం మాత్రమేనా? నా లోపల నుంచి కూడా ఒక నీచు వాసన వేస్తూ... ...

* * *

ఖద్దరు ఆసామి వస్తున్నట్టు కబురు వచ్చింది. పిల్లవాళ్ళు మళ్ళీ రిహార్సల్ మొదలుపెట్టారు.

"ఎగరాలి! నాంచారీ! ఎగరాలి!" కుర్రాడు చిలుకను మళ్ళీ ఉత్సాహ పరుస్తున్నాడు.

రెక్కలు విప్పడానికి సిద్ధంగా ఉన్న జెండా!

* * *

నడిచీ నడిచీ పుగాకు చేల మధ్య నడక ముగింపులేని ప్రయాణంలా ఉంది. చేలల్లోంచి నికోటిన్ వాసన మత్తుగా ముక్కులకు తాకుతుంది. ఆకుల మధ్య అట్లాగే పడిపోయి మత్తుగా పడుకోవాలనే కోరిక. జీపుల, కార్ల శబ్దం క్రమంగా చెవులను దాటుతుంది. కళ్ళు తిరుగుతున్నట్లు ఉంది. వాంతి అయ్యేలా ఉంది. కళ్ళు తిరగడం ఎక్కువయి అట్లాగే పొలం గట్టుపై కూల బడ్డాను. తల ముక్కలై పోతున్నట్లుగా ఉంది. కళ్ళముందంతా రక్తం. చేల పొడవునా, గట్ల పొడవునా, సుబ్బమ్మ తలలోంచి కారిన రక్తం. నన్ను వెంటాడు తున్నట్లుగా ఉంది. ఆకుపచ్చని పొలాలు. నీలాకాశం అంతా ఎరుపుగా మారాయి. కలర్ బ్లైండ్‌నెస్సా, హెల్యూజినేషనా, ఓపిక తెచ్చుకొని "మీరు వెళ్ళండి" అంటూ మిగిలిన వాళ్ళకు సైగ చేశాను.

చెవుల్లో ఒక కేక, అరుపు. ఇదీ హెల్యూజినేషనా? సుబ్బమ్మపై జరిగిన అవమానాన్ని నేనెందుకు ఖండించలేదు? ఒక ప్రశ్న. మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న. బర్రె శవమంత బరువైనదిగా, మోయలేనట్లుగా ఈ ప్రశ్న.

బేరన్ల దగ్గర కలకలం. ఎవరో మనిషి పొయ్యిలో చేతులు పెట్టాడని. చేతులు కాలిన మనిషి ఒకటే గొడవ.

"సుబ్బమ్మ మొగుడు సామేలును ఇట్లాగే బేరన్ల పొయ్యిలో కాల్చారట వాళ్ళు! పొయ్యిలో వేడి సరిగ్గా చూడక, లోపల ఆకులన్నీ మాడిపొయ్యాయట. వేలల్లో నష్టం వచ్చిందంటూ రెండు చేతుల్ని పొయ్యిలో పెట్టి - కాలి బొబ్బలెక్కి – ఆ కమురు వాసన పల్లెను రోజుల తరబడి వెంటాడిందట. కాలిన చేతులకు వైద్యం లేక సెప్టిక్ అయ్యి చచ్చిపొయ్యాడు" మాలతి విషయాలు చెబుతుంది.

కాలిన శరీరపు కమురు వాసన ముక్కులకు తగులుతుంది.

'మాలతీ ! నా మెదడుకేమైంది. శబ్దాలు, రంగులు, వాసనలు అన్నీ మారిపోతున్నాయి. నా మెదడుకు ఏదో జబ్బు చేసింది.'

"వామ్మో! నాయనో!" కాలినవాడి అరుపులు వెంటాడుతున్నాయి. చేలగట్లపై తడితడిగా ఎర్రగా రక్తం. కాళ్ళు, చెప్పులూ తడిసీ, "ఏదయినా కుంట కనబడితే ఆగుదాం. కాళ్ళు కడుక్కుందాం." మాలతి ఆశ్చర్యంగా చూసింది. "ఏమైంది కాళ్ళకు?" "రక్తం. రక్తం." పెద్దగా అరవాలని ప్రయత్నం. సాధ్యం కాలేదు.

పొలాలు క్రమంగా అదృశ్యమవుతున్నాయి. నల్లనల్లగా మెరుస్తున్న రోడ్డు. రోడ్డుపైకి చేరితే, ఏ లారీనో, బస్సో దొరికితే, ఆశగా అటు నడిచాం.

రోడ్డు ఒంటరిగా ఉంది. ఏళ్ళ తరబడి ఏ వాహనాన్ని చూడనట్లుగా ఉంది. "ఇది మెయిన్‌రోడ్డు కాదనుకొంటాను" మాలతి గొణిగింది. రోడ్డు పక్కనే పెద్ద అడ్వర్టైజుమెంటు బోర్డు. బోర్డు మధ్యలో 'బర్రె తల' నల్లగా, ఆరోగ్యంగా మిలమిలలాడుతూ. దాని కింద 'బఫెల్లోస్ క్లబ్' అని పెద్ద అక్షరాల్లో రాసి ఉంది.

"ఆరోగ్యానికీ, బలవర్ధకమైన ఆహారానికీ బఫెల్లోస్ క్లబ్‌ను దర్శించండి. ఇది ప్రభుత్వ యాజమాన్య సంస్థ" అని రాసుంది. పొడవాటి బాణం గుర్తు కుడివైపుకు చూపిస్తూ.

రోడ్డుపై నిర్మానుష్యం. పుగాకు గ్రేడింగ్ కంపెనీల పక్కన పుగాకు బేళ్ళు పర్వతాల్లా పేర్చి ఉన్నాయి. పొడవాటి షెడ్డు ముందు 'బఫెల్లోస్ క్లబ్' అంటూ బోర్డు. బోర్డుపై నల్లగా మిలమిలలాడే బర్రె తల.

"లోపలి కెళదాం. కాఫీ అన్నా దొరుకుతుందేమో?" అంటూ మాలతితో పాటు నడిచాను. విశాలమైన హాలు. పల్చటి వెలుతురు. పాతిక పైగా బల్లలు. చుట్టూ సొగసైన కుర్చీలు. బల్లలపై పల్చటి వెలుతురు చిమ్మే ఫోకస్ లైట్లు. బల్లలపై ఎర్రటి ప్లేట్లు రక్తంతో చేసినట్లుగా. స్టీరియోలోంచి వినపడే ఇంగ్లీషు

పాట క్రమంగా వోల్టేజి తగ్గి, శవం కోసం ఏడ్చే ఏడుపులా సాగదీయబడి భయం గొలుపుతూ ఉంది.

పక్క టేబుల్ నుంచి పెద్ద పెద్ద శబ్దాలు. వాళ్ళ కబుర్లు, పెద్దగా గురగుర శబ్దాల్లా వినిపిస్తున్నాయి. "వైయాగ్రా గురించి మీ ఒపీనియనేమిటి?" "ఈ శతాబ్దంలోనే గొప్ప డిస్కవరీ. చంకలు బాదుకొనే ఫెమినిస్టులకు వైయగ్రానే సమాధానం."

కోపంగా అటువైపు చూసి ఉలిక్కిపడ్డాను. టేబుల్పై ఉన్నది మనుషులు కాదు. ఫాంటు, చొక్కా వేసుకొన్న దున్న. పక్కనే చీరకట్టుకొన్న బర్రె. నిక్కరు, చొక్కాలు వేసుకొన్న దూడలు. ద బఫెల్లోస్ ఫ్యామిలీ.

నా నోట మాట రాలేదు. హెల్యూజినేషనేమో అనిపించింది. ఊహ కాదు. ఎదురుగా మాలతి కూర్చొనే ఉంది. మౌనంగా గొప్ప ఆలోచనలో ఉంది. "మాలతీ! చూశావా ఈ వింత" అని అరవాలనిపించింది. నోట మాట రాలేదు. ఖద్దరు పంచె, ధోవతీ కట్టుకొన్న రెండు దున్నలు విలాసంగా నడుచుకొంటూ నా ముందు సీట్లో కూలబడ్డాయి.

"వాట్ డు యు వాంట్" పక్క టేబుల్ దగ్గర ఆర్డర్ తీసుకొంటున్నాడు వెయిటర్. "మనిషి పెనిస్‌తో చేసిన సూప్ దొరుకుతుందా?" "యస్ సర్. ఉయ్ హేడ్! ఉడ్ యు లైక్ టు హేవ్ టుడేస్ స్పెషల్ అమెరికన్ పెనిస్ సూప్! స్పెషల్లీ ఇంపోర్టెడ్ ఫ్రం స్టేట్స్" "ప్లీజ్ ఆర్డర్ ఇట్"

నా గొంతులో తడి ఆరిపోయింది. బరువైన అడుగులతో మా వైపు వచ్చాడు స్టీవార్టు. "గుడ్ మార్నింగ్ సర్ అండ్ మేడమ్. వాట్ డు యు వాంట్!" అవి మాటల్లా లేవు గురగురమంటున్న శబ్దాల్లా ఉన్నాయి. తెల్లటి షర్ట్, ప్యాంట్, నెక్ టై, మినీ సూట్‌లో ట్రిమ్‌గా ఉందా బఫెల్లో.

హెల్యూజినేషన్! హెల్యూజినేషన్! ఇదంతా నాన్సెన్స్. మాలతీ! సమ్ థింగ్ రాంగ్ విత్ మి.

'రెండు కప్పుల కాఫీ చెప్పు" మాలతే ఆర్డర్ చెప్పింది.

"మేమ్! హేవ్ సమ్ హార్డ్ స్టఫ్. స్పెషల్ హ్యూమన్ బ్రెయిన్ మసాల ఉంది మాడమ్. మెత్తగా, టేస్టీగా. ట్రై ఒన్స్ మేమ్."

"అవసరం లేదు. కాఫీ చాలు" మాలతి విసుగ్గా చెప్పింది.

హఠాత్తుగా తుపాకీ పేలిన శబ్దం. సెంట్రీ యూనిఫారంలో ఉన్న బఫెల్లో హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. "క్లోజ్ ద డోర్స్. క్లోజ్ ద షట్టర్స్. ది దళిత్ బఫెల్లోస్ ఆర్ కమింగ్" పెద్దగా అరుస్తున్నాడా సెంట్రీ బఫెల్లో.

హాలులో అందరూ భయంతో లేచారు. నా పక్కనున్న సూట్‌వాలా బఫెల్లో, ఖద్దరు బఫెల్లో తుపాకులు బయటకు తీశారు. "కిల్ దెమ్! ఒక్కటి కూడా మిగలడానికి వీల్లేదు" ఖద్దరు బఫెలో భయంతో అరుస్తున్నాడు.

మాలతి నిర్లిప్తంగా చూస్తుంది. ఏమిటిది? మాలతి ఇంత కూల్‌గా ఎట్లా ఉండగలుగుతుంది. హాలులో హడావుడిగా ఉంది. తలుపులన్నీ మూసి వేశారు. లైట్లు ఆర్పివేశారు. టేబుళ్ళపై కాండిల్స్ ఆపివేశారు.

తలుపులపై ధన్‌ధన్ మంటున్న చప్పుడు. ఫెడేల్‌మంటూ షట్టర్లు ఒక్కసారిగా విరిగాయి. నల్లగా, నిగనిగలాడుతూ అందంగా దళిత బఫెల్లో! అయ్యో ఇది సుబ్బమ్మగారి గేదె. నేను ఎగ్జైటింగ్‌గా అరిచాను. తుపాకులు ధన్‌ధన్‌మంటూ పేలాయి. దాని శరీరంపై ఎర్రెర్రగా బుల్లెట్ మరకలు. అది అట్లా నిర్భయంగా నడుస్తూనే ఉంది. తుపాకులు పారేసి పరుగులు అందుకొన్నాయి మిగిలిన బఫెల్లోలు. వెంటాడి, వెంటాడి సూట్‌వాలా బఫెల్లోని, ఖద్దరు బఫెల్లోని ముందుకాళ్ళతో ఒక్క తన్ను తన్ని, నేలపై జారిన దాని పొట్టలో కొమ్ముల్తో ఒక పోటు పొడిచి - రక్తం ఎగజిమ్మింది. మూతిపైనున్న రక్తాన్ని తుడుచుకొని తాపీగా వచ్చి టేబుల్‌పై కూర్చుంది దళిత్ బఫెల్లో.

"మెదడు సూప్ పట్రా" పెద్దగా అరుస్తుంది దళిత్ బఫెల్లో. "పొలిటీషియన్ల మెదళ్ళు ఉన్నాయేమో చూడు" ఆర్డర్ చేసి, సిగరెట్ తీసుకొని తాపీగా వెలిగించుకొని, అగ్గిపుల్ల పుగాకు బేళ్ళపై విసిరింది -

మంటలు. మంటలు. ఎర్రగా నాలుకలు సాచి పుగాకు బేళ్ళపై మంటలు. ఆహ్లాదంగా నవ్వుతూ, ఆనందిస్తుంది దళిత బఫెల్లో.

దగ్గరగా వెళ్ళి షేక్‌హాండ్ ఇద్దామని లేచాను. వద్దంటూ వెనక్కు లాక్కుంది మాలతి.

"రండి. మీకేదో పిచ్చి పట్టింది. ఎవరైనా చూస్తే ప్రాణాలు తీస్తారు" మాలతి నన్ను భయంతో వెనక్కు లాగుతోంది. బఫెల్లో క్లబ్ దాటి, తారురోడ్డు దాటి, మళ్ళీ పుగాకు పొలాల్లోకి పరిగెత్తి, పొలాల మధ్య కూలబడి.

"ఏమిటట్లా చేశారు. ఉన్మాదిలాగా ఆ పుగాకు బేళ్ళకు నిప్పు పెట్టారు! ఇక ఆ మంట ఆరదు. లక్షల్లో నష్టం. ఎవరైనా చూస్తే మనల్ని చంపి అందులోకి విసిరేసేవాళ్ళు."

కొంత అర్థమయ్యీ, అర్థంకాక, కొంత నిజం, కొంత హెల్యూజినేషనూ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 1998*